క్లుప్తంగా

సీఎం సభకు సన్నద్ధం కండి



కార్యకర్తలకు సూచనలిస్తున్న పచ్చిరిపల్లి రాము

అల్లిపురం : ఈ నెల 27వ తేదీన భీమిలిలో నిర్వహించే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సభకు పార్టీ శ్రేణులు సమాయత్తమవ్వాలని ఎమ్మెల్యే వాసుపల్లి ఇచ్చిన పిలుపు మేరకు 33వ వార్డు కార్యకర్తలు మంగళవారం సమావేశమయ్యారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సభకు తరలి వెళ్లేందుకు తాము సైతం అని మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో పచ్చిరిపల్లి రాము, ఎం.రమేష్, బుద్ద గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాజన్న ఆటోనగర్ శంకుస్థాపనకు సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఖాజావలీ

డాబాగార్డెన్స్ : వేలాది మంది కార్మికులు జీవనం సాగిస్తున్న రాజన్న ఆటోనగర్ శంకుస్థాపనకు ఎమ్మెల్యేలందరూ సహకరించాలని ఆటోనగర్ యూనియన్ అధ్యక్షుడు ఖాజావలీ విజ్ఞప్తి చేశారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజన్న ఆటోనగర్ ఆటోమొబైల్ సభ్యులు ఆనందపురం, తగరపువలస నుంచి టౌన్‌కొత్తరోడ్డు, పెందుర్తి నుంచి ఎంవీపీ కాలనీ వరకు విస్తరించి ఉన్నారన్నారు. వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి కలెక్టర్‌తో చర్చించి రాజన్న ఆటోనగర్ శంకుస్థాపన దిశగా తీసుకెళ్తారని ఆశిస్తున్నామన్నారు. యూనియన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఐ.విజయకుమార్ మాట్లాడుతూ శంకుస్థాపన త్వరితగతిన చేయిస్తారని ఆటోమొబైల్ యజమానులు, వర్కర్లు ఎదురు చూస్తున్నారని తెలిపారు.


స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకుంటాం



దీక్షలో పాల్గొన్న పీవోడబ్ల్యూ నాయకులు

సీతమ్మధార : ప్రాణత్యాగం ద్వారా సాధించుకున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకుంటామని పీవోడబ్ల్యూ ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి అన్నారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద జరుగుతున్న 1027వ రోజు నిరాహార దీక్షలో ఆమె పాల్గొన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. 32 మంది ప్రాణ త్యాగంతో ఉద్భవించిన స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవాలంటే పోరాటమే శరణ్యమన్నారు. పీవోడబ్ల్యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.వెంకటలక్ష్మి, డీకేఎస్ రోహిణీదేవి, జిల్లా కార్యదర్శి ఇందిర పాల్గొన్నారు.

చెత్తకుప్పలో హోంగార్డ్ టోపీ



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద చెత్తలో హోంగార్డు టోపీ

సీతమ్మధార : హోంగార్డు తలపై ఉండాల్సిన టోపీ చెత్తకుప్పలో ఉండటం పలువురిని ఆశ్చర్యపరిచింది. జీవీఎంసీ గాంధీ పార్కులోని ఒక చెట్టు పక్కన చెత్తలో టోపీ పడి ఉంది. ఆ ప్రాంతంలో ప్రతి రోజు పోలీసులు, హోంగార్డులు, కానిస్టేబుళ్లు, అధికారులు, ఎస్ఐలు, సీఐలు విధులు నిర్వహిస్తుంటారు. అయితే హోంగార్డు టోపీ మరిచిపోయి చెత్తలో పడి ఉన్నా ఎవరూ పట్టించుకోలేనట్లు తెలుస్తోంది.

అధ్యాపకులకు ముగిసిన శిక్షణ

అగనంపూడి: విద్యార్థుల ఆలోచనలకు అనుగుణంగా విద్యాబోధన సాగించాలని సొల్యూషన్స్ టీమ్ టాలెంట్ మెట్రిక్స్ ప్రతినిధి సుప్రితా సింఘా అన్నారు. దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన అధ్యాపకుల శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అధ్యాపకులు నిరంతర విద్యార్థులుగా బోధనలో మెలకువలు తెలుసుకోవాలన్నారు.



ముంగిట్లో ఆధార్ సేవలు

ప్రజలు ఏం కోరుకుంటున్నారో పాలకులు సరిగ్గా అంచనా వేయగలగాలి. వారి అవసరాలను సమయానుకూలంగా తీరుస్తూ ఉండాలి. అప్పుడే అటువంటి పాలకులు ప్రజారంజక పాలన అందించగలరు. సరిగ్గా అలాంటి సుపరిపాలనే అందిస్తూ ప్రజల చేత మన్ననలు అందుకుంటున్నారు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి. ఎన్నో పథకాలతో పేదవాడి జీవన ప్రమాణాలు మెరుగుపరిచిన జగనన్న ఇప్పుడు వారి లోగిళ్ల ముంగిటకే ప్రభుత్వ పాలనను తీసుకెళ్లారు. నాయకులు, అధికారుల చుట్టూ పేదవాడు తిరగటం కాదు.. అతని ముంగిటకే మనం వెళ్లాలి అని స్ఫూర్తినందించారు. దరిమిలా సంక్షేమ పథకాలు, ఫలాలు, ప్రభుత్వ సేవలు అన్నీ బడుగు, బలహీనవర్గాల చెంతకు చేరాయి. ఈ నేపథ్యంలో ఆధార్ సేవలు కూడా సచివాలయాల ద్వారా అతి సులువుగా ప్రజలకు అందిస్తూ సీఎం జగనన్న జనం మన్ననలు అందుకుంటున్నారు.

సచివాలయాల్లోనే నమోదు.. అప్‌డేట్.. తప్పుల సవరణ

ఇది కదా ప్రజల వద్దకు పాలన అంటున్న లబ్ధిదారులు

జగదాంబ : కొన్నాళ్ల కిందట కొత్త ఆధార్ కార్డులంటూ.. ఆధార్ అప్‌డేట్ అంటూ.. కేవైసీ అంటూ జనాలను పరుగులు పెట్టించారు. ఉన్న పళంగా ఎక్కడి వారక్కడ చేస్తున్న పనుల్ని సైతం వదిలేసి నెట్ సెంటర్లకు ఉరుకులెత్తారు. తీరా అక్కడికి వెళ్తే కొండవీటి చాంతాడంత క్యూలైన్లు ఉండేవి. తెల్లవారి వెళ్తే ఏ సాయంత్రానికో తిరిగి వచ్చేవారు. ఆడవాళ్లకు పిల్లల ఆలనాపాలనా.. ఇంటి పని అయ్యేది కాదు. మగవారు విధులకు సెలవు పెట్టడమో.. పర్మిషన్ అడగటమో చేయాల్సి వచ్చేది. ఇంత చేసినా అనుకున్న రోజు పని అవుతుందో లేదో కూడా తెలిసేది కాదు. ఇటువంటి ఇబ్బందులకు ఫుల్‌స్టాప్ పెట్టింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం. ప్రజల ముంగిటకే పాలన అనే నినాదంతో సుపరిపాలన అందిస్తోన్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్ని సేవల్లాగే ఆధార్ సేవలను కూడా ప్రజల చెంతకు చేర్చారు. జోన్ పరిధిలో ఉన్న సచివాలయాల ద్వారా ఆధార్ సేవలను సునాయాశంగా అందిస్తున్నారు. నిజంగా ఇది సరికొత్త విప్లవమని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అతి దుర్లభమనిపించిన ఆధార్ సేవలను ఇంత సులభతరం చేసిన ముఖ్యమంత్రి జగన్‌కు ధన్యవాదాలు చెప్పుకుంటున్నారు. తమతమ ఇళ్లకు అతి సమీపంలో ఉన్న సచివాలయాలకు వెళ్లి ధీమాగా ఆధార్ నమోదు, అప్‌డేట్, తప్పుల సవరణ వంటివి చేయించుకుంటున్నారు. ఇది కదా ప్రజాపాలన అని జగనన్నను కొనియాడుతున్నారు.



వెలంపేట సచివాలయంలో ఆధార్ అప్‌డేట్ చేయించుకుంటున్న ప్రజలు

21 వేలకు పైగా.. : జీవీఎంసీ జోన్-4 పరిధిలోని 12 వార్డుల్లో 68 సచివాలయాలకు సంబంధించి 10 కేంద్రాల్లో ఆధార్ అప్‌డేట్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇక్కడ ఈ కార్యక్రమం జరుగుతుండగానే ప్రజల వెసులుబాటు కోసం ప్రత్యేక డ్రైవ్‌లు కూడా ఏర్పాటు చేసి స్థానికులు కోరిన సేవలందిస్తున్నారు. దీంతో 21 వేల మందికి పైగా ఆధార్ లబ్ధిదారులు సేవలు పొందారు. పేర్లలో తప్పులు, చిరునామా మార్పు, ఏజ్‌లో రాంగ్ ఎంట్రీ.. ఇలా ఆధార్‌లో ఏ తప్పులున్నా ప్రజలు కోరిన సేవలందిస్తున్నారు. అలాగే ఇప్పటికీ ఆధార్ పొందని వారికి, పుట్టిన శిశువులకు సచివాలయాల్లో నూతనంగా ఆధార్ నమోదు ప్రక్రియ చేపడుతున్నారు.

జీవీఎంసీ జోన్-4 పరిధిలోని 12 వార్డుల్లో ఆధార్ సేవలు ఇలా..

మంజూరైన కొత్త ఆధార్ కార్డులు	మార్పులు చేర్పులు చేసిన ఆధార్ కార్డుల సంఖ్య
100	19,314

చిన్నారుల పేరిట మంజూరైన కొత్త ఆధార్ కార్డులు **2 వేలు**

మొత్తం **21,414**

తిరిగే బాధ తప్పింది..



చదువు లేని మాలాంటి వారికి ఏ ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించి ఏ పని చేయించుకోవాలన్నా ఇబ్బందిగా ఉండేది. ఎక్కడ ఏ పని చేస్తారు.. ఏ అధికారిని కలవాలి.. ఎవరి దగ్గర సంతకాలు చేయించుకోవాలో తెలియక తికమక పడేవాళ్లం. జగనన్న ప్రభుత్వం వచ్చాక ఆ బాధలు తప్పాయి. ఆధార్ కార్డే కాదు అన్ని ప్రభుత్వ పథకాలు, ధ్రువపత్రాలు నేరుగా ఇంటికే వచ్చేస్తున్నాయి.

– డి.అప్పలసూరి, ప్రసాద్‌గార్డెన్స్

జగనన్న పాలన బాగుంది..



ఆధార్ కార్డుకు సంబంధించి గతంలో చాలా తిప్పలు పడ్డాం. కొత్తగా నమోదు.. తప్పుల సవరణకు సంబంధించి ఎక్కడికి వెళ్లాలో మాకు తెలియలేదు. ఇప్పుడు జగనన్న ప్రభుత్వం వలంటీర్ల ద్వారా మొత్తం సమాచారం మాకు అందజేయటం వల్ల సచివాలయానికి వెళ్లి ఆధార్ సేవలు సులువుగా చేయించుకున్నాం. గవర్నమెంట్‌లో పనులు ఇంత సులువుగా పూర్తి కావటం ఇదే మొదటి సారి. జగనన్న పాలన బాగుంది.

– విత్తనాల మంగ, వెలంపేట, 35వ వార్డు

నిరంతర ప్రక్రియ..



సచివాలయాల్లో ఆధార్ అప్‌డేట్ అనేది నిరంతరం జరుగుతూనే ఉంటుంది. ప్రజలు తమ పరిధిలో ఉన్న సచివాలయానికి వెళ్లి కావలసిన సేవలు పొందొచ్చు. ఆధార్ నమోదు, పొరపాట్ల సవరణ, చిరునామా మార్పు వంటి ఎటువంటి సేవలైనా దగ్గరలోని సచివాలయంలో చేస్తారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

– రామాంజనేయులు, వెలంపేట సచివాలయం ఎడ్మిన్, 35వ వార్డు

వెంకటేశ్వరమెట్ట సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే కృషి



ప్రభుత్వ అడిషనల్ సెక్రటరీ రేవు ముత్యాలరాజుకు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

అల్లిపురం : వెంకటేశ్వరమెట్ట సమస్య పరిష్కారం కోరుతూ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అడిషనల్ సెక్రటరీ రేవు ముత్యాలరాజును మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. అక్కడి వారు తమ అవసరాలకు ఆస్తి అమ్ముకోలేక, రిపేర్లు, రిజిస్ట్రేషన్లు చేసుకోలేక అవస్థలు పడుతున్నారని తెలిపారు. దేవదాయ శాఖకు ప్రత్యామ్నాయంగా గాజువాకలో స్థలం కేటాయించినట్లు చెప్పారు. ఈ సమస్య పరిష్కారం కోరుతూ ఇప్పటికే ముఖ్యమంత్రి కార్యదర్శి ధనుంజయరెడ్డికి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణకు విషయం తెలియజేశామన్నారు. సంబంధిత ఫైల్ క్యాబినెట్‌లో పెట్టినట్లు ముత్యాలరాజు తెలిపారన్నారు. త్వరలోనే వెంకటేశ్వరమెట్ట వాసుల సమస్య పరిష్కారం కాబోతుందని ఎమ్మెల్యే వాసుపల్లి తెలిపారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

25న సహస్ర తులసీపూజ.. : కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 25న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఆలయ ఈవో కె. శిరీష తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు పూజా రుసుం రూ.1500 చెల్లించి దంపతులు ఈ పూజలో పాల్గొనవచ్చని ఈవో పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరు

- ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే వాసుపల్లి



దొండపర్తి ప్రజాదర్బార్‌లో వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్



లక్ష్మీ టాకీస్ వద్ద వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

సీతమ్మధార : రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ధీమా వ్యక్తం చేశారు. జీవీఎంసీ 27వ వార్డు దొండపర్తిలోని పరదేశమ్మ గుడి వద్ద మంగళవారం జరిగిన ప్రజాదర్బార్‌లో ఆయన పాల్గొన్నారు. 27, 41, 42 వార్డులకు సంబంధించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా శాశ్వత పరిష్కారం చూపిన ఎమ్మెల్యే వాసుపల్లికి వెంకటేశ్వరమెట్ట ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసుపల్లి మాట్లాడుతూ ప్రజాదర్బార్‌లో వచ్చిన సమస్యలను నూటికి నూరు శాతం పరిష్కరించడానికి కృషి చేస్తున్నామన్నారు. సమస్యలు లేని నియోజకవర్గంగా దక్షిణాన్ని తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. వైవీ సుబ్బారెడ్డి నేతృత్వంలో అల్లిపురం వెంకటేశ్వరమెట్ట దేవస్థానానికి నాలుగెకరాల 15 సెంట్ల స్థలానికి బదులుగా గాజువాక పెదగంట్యాడలో 78 కోట్ల విలువల గల ఏడు ఎకరాల 50 సెంట్ల స్థలాన్ని కేటాయించారన్నారు. దీనిపై ఈనెల 31వ తేదీన క్యాబినెట్‌లో ఆమోదం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో 27వ వార్డు అధ్యక్షుడు, ఎరుకుమాంబ ఆలయ ట్రస్ట్‌బోర్డ్ చైర్మన్ నీలాపు సర్వేశ్వరరెడ్డి, అధికారులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు , గృహసారథులు పాల్గొన్నారు.

వన్‌టౌన్ లక్ష్మీ టాకీస్ వద్ద..

జగదాంబ : పెన్షన్లు, ప్రభుత్వ గృహాల కేటాయింపు, సీఎం రిలీఫ్ ఫండ్ వంటి వివిధ సమస్యలపై ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌కు స్థానిక ప్రజలు వినతులు సమర్పించారు. వన్‌టౌన్‌లోని లక్ష్మీ టాకీస్ వద్ద మంగళవారం జరిగిన ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ నేరుగా ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. గత ప్రభుత్వంలో ఇళ్ల కోసం రూ.500 డీడీలు కట్టిన వారికి న్యాయం చేస్తామని, ఎటువంటి లోటుపాట్లు ఉన్నా సరిదిద్ది అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, వార్డు, మండల ప్రెసిడెంట్లు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, స్టేట్ డైరెక్టర్లు, ఆలయ చైర్మన్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులంతా నా కుటుంబ సభ్యులే..

మహారాణిపేట : మత్స్యకారులంతా తన కుటుంబ సభ్యులేనని, వారి సమస్యలను తన సమస్యలుగా భావించి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. ఫిషింగ్ హార్బర్‌లో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఆయన మాట్లాడారు. పేదలంటే ఇట్టే సాయం అందించే సీఎం జగనన్న మత్స్యకారుల అభివృద్ధికి కూడా ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో బోట్లు దగ్ధమైతే స్పందించి తక్షణమే 80 శాతం పరిహారం అందించిన ఘనత ఆయనదేనన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నాలుగు చోట్ల హార్బర్ల నిర్మాణం శరవేగంగా జరుగుతోందని, త్వరలో కేంద్ర ప్రభుత్వ సహాయంతో మత్స్యకారుల సంక్షేమానికి ఏపీ మరింత చొరవ తీసుకుంటుందన్నారు. ఆయిల్ సబ్సిడీ బకాయిలు సుమారు రూ. 3 కోట్లు మంజూరు చేయాలని పలువురు బోటు యాజమానులు కోరగా ఎమ్మెల్యే స్పందించి ఫిషరీస్ కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. అలాగే అయ్యారక కులానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని వాసుపల్లి గణేష్‌కుమార్‌కు వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నాయకులు వినతిపత్రం అందజేశారు. మత్స్యకార సంఘాల నాయకులు బర్రి కొండబాబు, మండల ప్రెసిడెంట్లు, వార్డు ప్రెసిడెంట్లు పాల్గొన్నారు.

నేతాజీ అడుగు జాడల్లో నడవాలి



నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఏవీఎన్ కాలేజీ ప్రిన్సిపాల్ సింహాద్రినాయుడు



నేతాజీ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న డాక్టర్ జహీర్ అహ్మద్ తదితరులు

డాబాగార్డెన్స్ : ఏవీఎన్ కళాశాలలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని 'పరాక్రమ దివస్'గా నిర్వహించారు. కళాశాల ప్రాంగణంలో గల నేతాజీ విగ్రహానికి ప్రిన్సిపాల్ ఎం. సింహాద్రినాయుడు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి విద్యార్థి సుభాష్ చంద్రబోష్ అడుగు జాడల్లో నడుస్తూ ఆయనలా ధైర్యంగా అన్యాయాన్ని అరికట్టాలన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కృష్ణకుమారి, అకడమిక్ డీన్ శంకర్ నారాయణ, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్, జువాలజీ విభాగాధిపతి డాక్టర్ అర్చన, పి. వెంకటరత్నం, డి. గాయత్రి, సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వివేకానంద సంస్థలో..

జగదాంబ : వివేకానంద సంస్థలో జరిగిన నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సంస్థ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ జహీర్ అహ్మద్ హాజరై నివాళులర్పించారు. సాయుధ పోరాటం ద్వారానే బ్రిటిష్ వారిని తరిమి కొట్టవచ్చని నేతాజీ నమ్మారని తెలిపారు. అందరికీ మన అమర వీరుల చరిత్రలు తెలియాలన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు అప్పారావు, సభ్యులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ కళాశాలలో ఫ్లాష్‌మాబ్ రేపు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఓఎస్‌డీ లక్ష్మీనారాయణ తదితరులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ఫ్లాష్‌మాబ్ నిర్వహించనున్నట్టు నిర్వాహకుడు కె.హేమంత్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఇంజినీరింగ్ కళాశాల ఓఎస్‌డీ ఆచార్య లక్ష్మీనారాయణ, చీఫ్ వార్డెన్ ఆచార్య చిట్టిబాబు, ఏయూ మహిళా ఇంజినీరింగ్ కళాశాల విభాగాధిపతి ఆచార్య ఎస్.ప్రజ్ఞలతో కలిసి మంగళవారం ఆవిష్కరించారు. అందరూ సమానమే అనే నినాదంతో ఒక సామాజిక సందేశాన్ని చాటే విధంగా ఈ ఫ్లాష్‌మాబ్ గురువారం మధ్యాహ్నం 3.30 గంటలకు ఇంజినీరింగ్ కళాశాల బాస్కెట్‌బాల్ మైదానంలో జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏయూ యునైటెడ్ క్లబ్ అధ్యక్షుడు హేమంత్, తదితరులు పాల్గొన్నారు.

నైతిక విలువలు బోధించే నాయకత్వం అవసరం



గాంధీజీ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న అతిథులు

ఏయూ క్యాంపస్: నైతిక విలువలు బోధించే నాయకత్వం కోసం యువత ఎదురు చూస్తోందని ఏయూ న్యాయ కళాశాల పూర్వ ఆచార్యుడు, డీఎస్ఎన్ఎల్‌యూ పూర్వ వీసీ ఆచార్య వై.సత్యనారాయణ అన్నారు. ఏయూ గాంధీ అధ్యయన కేంద్రంలో మంగళవారం నిర్వహించిన గాంధీజీ-జాతీయ సమైక్యత కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సమాజంలో ప్రతీ పౌరుడు బాధ్యతలు కలిగి ఉండాలన్నారు. ముందుగా మహాత్మగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రత్యేక అతిథి విజయ విహారం రమణ మూర్తి మాట్లాడుతూ సంఘర్షణలు పరిష్కరించడానికి గాంధీజీ ఆలోచనలు ఉపకరించే విధానాలు వివరించారు. ఏయూ ఆర్ట్స్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు, గాంధీ అధ్యయన కేంద్రం సంచాలకులు ఆచార్య కె.సీతామాణిక్యం తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ కార్యదర్శి ఎం.శ్యామ్ ప్రసాద్, విశాఖ స్టీల్ ప్లాంట్ ఐఎన్‌టీయూసీ నాయకులు మంత్రి రాజశేఖర్, ఆచార్య టి.శోభశ్రీ, ఆచార్య ఎస్.హరనాథ్, డాక్టర్ పి.కిషోర్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా పోలమాంబ వార్షిక జాతర



డాబాగార్డెన్స్ : జీవీఎంసీ 30వ వార్డు కుమ్మరవీధిలో వెలసిన బహుముఖ రూపాల పోలమాంబ 66వ వార్షిక జాతర మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. సోమవారం తొలేళ్ల సంబరంతో ప్రారంభమైన జాతర మంగళవారం ప్రధాన పండగ అత్యంత వైభవంగా జరిపారు. పరస మహోత్సవం సందర్భంగా సాయంత్రం 6 గంటలకు ఆలయ ప్రాంగణం వద్ద నిప్పుల గుండం, భక్తుల సమక్షంలో ముత్తయిదువులతో ఘటాభిషేక ఉత్సవం, సాయంత్రం 5 గంటల నుంచి పుర వీధుల గుండా ఊరేగింపు, విద్యుత్ దీపాలంకరణ, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. పౌరాణిక వేషధారణలు, సాముగరిడీలు, దాసుళ్ల సందళ్లు, డీజే వాయిద్యాల హోరుతో పరస మహోత్సవం సందడిగా సాగింది. అప్పలక్ష్మలు.. పులుల సందడి.. డప్పు వాయిద్యాలు.. తీన్మార్ బ్యాండ్‌తో ఆ ప్రాంతమంతా దద్దరిల్లింది. కుమ్మరవీధి, సాలిపేట, చాకలిపేట, తాడివీధి, వార్డు బాయి లేన్, మంథావారి వీధి, పూర్ణామార్కెట్, మహారాణిపేట తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారికి మొక్కులు సమర్పించుకున్నారు. పలువురు ప్రముఖులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్త్ ఏర్పాటు చేశారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి పెద్ద ఎత్తున అన్న సమారాధన నిర్వహించనున్నట్టు పోలమాంబ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు.

26న రాచపోలమాంబ పరస



అల్లిపురం : జీవీఎంసీ 32వ వార్డులో వెలసిన శ్రీ రాచ పోలమాంబ అమ్మవారి 20వ పరస మహోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం అమ్మవారి ఉత్సవ విగ్రహానికి తిరువీధి నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో కలశాలతో పాల్గొన్నారు. శుక్రవారం తెల్లవారు జాము నుంచి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించనున్నారు. అనంతరం భక్తులకు దర్శనాలు కల్పిస్తామని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తుల క్యూలైన్లు, ప్రసాదాల పంపిణీకి ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామ ప్రజలతో పాటు నగర ప్రజలు పాల్గొని అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

ఐజీబీసీ స్టూడెంట్ చాప్టర్ ప్రారంభం



స్టూడెంట్ చాప్టర్ ప్రారంభిస్తున్న ఆచార్యులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్(ఐజీబీసీ) స్టూడెంట్ చాప్టర్‌ని మంగళవారం ప్రారంభించారు. ఆరో హరిత్ ప్రేమ్ భారత్ మహోత్సవ్ 2024లో భాగంగా 369వ విద్యార్థి శాఖను ఏయూ సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో ఏర్పాటు చేశారు. గ్రీన్ బిల్డింగ్‌లపై యువతకు అవగాహన కల్పిస్తూ, వీటికి సంబంధించిన సమాచారాన్ని ఈ శాఖ అందిస్తుంది. ఐజీబీసీ విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం చైర్మన్ లీలా ప్రసాద్, ఉపాధ్యక్షులు డాక్టర్ కె.కుమార్‌రాజ.. స్టూడెంట్ చాప్టర్ ప్రారంభోత్సవానికి సంబంధించిన ధ్రువ పత్రాలను ఏయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.శశిభూషణరావుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య సి.ఎన్.ఇ.సత్య నారాయణరెడ్డి, ఐజీబీసీ సీనియర్ కౌన్సెలర్ శ్రీరేఖ తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం



జీలకర్ర బెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠింపజేసి ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

సుబ్రహ్మణ్యస్వామికి విశేష పూజలు

సింహాచలం: అడవివరం దరి విజినిగిరిపాలెంలోని ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో కొలువైన వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామికి మంగళవారం విశేషంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు తరలి వచ్చి స్వామి సన్నిధి చుట్టూ ప్రదక్షిణ చేసి భక్తిశ్రద్ధలతో ఘనంగా క్షీరాభిషేకం నిర్వహించారు.